క్లుప్తంగా

శ్రీ సీతారామ కల్యాణానికి ముహూర్తపు రాట



ముహూర్తపు రాట వేస్తున్న కాళిదాసు శర్మ

పార్వతీపురంటౌన్: ఈనెల 17న శ్రీరామనవమి సందర్భంగా శ్రీ సీతారామ కల్యాణం మహోత్సవం నిర్వహించేందుకు వేముకోటి వారి వీధిలో శ్రీ సర్వమంగళా విద్యాపీఠ వ్యవస్థాపకుడు కాళిదాసు శర్మ ఇంటి వద్ద సోమవారం ముహూర్తపు రాట వేశారు. ఏటా శ్రీ సీతారామ కల్యాణం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని ఈ మహోత్సవానికి రాజకీయ ప్రముఖులు హాజరవుతారని కాళిదాసు శర్మ చెప్పారు. భక్తులందరూ పాల్గొని స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

మృతుని కుటుంబానికి డిప్యూటీ సీఎం పరామర్శ



శ్రీరాములు నాయుడు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర

సాలూరు రూరల్: ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన వీఆర్‌ఓ గొర్లి శ్రీరాములు నాయుడు కుటుంబాన్ని డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర సోమవారం పరామర్శించారు. మృతుని స్వగ్రామ మైన పెదబోరబందలో సోమవారం పెద్దకర్మ చేశారు. ఈ కార్యక్రమానికి రాజన్నదొర పార్టీ నాయకులతో కలిసి వెళ్లి ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఅవసరం వచ్చినా తానున్నానని మృతుని కుటుంబసభ్యులకు భరోసా ఇచ్చారు. రాజన్నదొర వెంట వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దండి శ్రీను తదితరులు ఉన్నారు.

అవగాహన పెంపొందించుకోవాలి



అగ్నిప్రమాదాల నివారణపై ప్రయోగాత్మకంగా వివరిస్తున్న అగ్నిమాపకశాఖ అధికారులు, సిబ్బంది

సాలూరు: అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన పెంపొందించుకోవాలని అగ్నిమాపక అధికారి సుధాకర్‌రావు అన్నారు. ఈ మేరకు అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సోమవారం పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్యాస్, విద్యుత్, నిర్లక్ష్యంగా ధూమపానం చేయడం తదితర కారణాలతో అగ్నిప్రమాదాలు ఏ విధంగా సంభవిస్తాయి? వాటిని ఎలా నివారించాలనే అంశాలను ప్రయోగాత్మకంగా వివరించారు. అగ్నిప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన పెంపొందించారు. కార్యక్రమంలో అగ్నిమాపకశాఖ అధికారులు, సిబ్బంది సీతంనాయుడు, సీతారాం, సురేష్‌కుమార్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి మేట్లకు శిక్షణ



మాట్లాడుతున్న ఎంపీడీవో దేవకుమార్

మక్కువ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో, కాశీపట్నం సచివాలయంలో ఉపాధిహామీ పథకం మేట్లకు ఎంపీడీవో పి.దేవకుమార్ సోమవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండ తీవ్రత దృష్ట్యా పనిప్రదేశాలలో మంచినీరు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. పనిప్రదేశం వద్ద తప్పనిసరిగా నీడ ఏర్పాటుచేసుకోవాలని, ఉదయం, సాయంత్రం రెండుపూటలా పనులు జరిపించాలని కోరారు. వేతనదారుల సంఖ్య పెరిగేలా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏపీవో ఈశ్వరమ్మ, ఈసీ వెంకటలక్ష్మి, ట్రైనింగ్ కోఆర్డినేటర్ మహేష్ పాల్గొన్నారు.

సీజ్ చేసిన వాహనాలకు బహిరంగ వేలం రేపు

సాలూరు: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కేసుల్లో సీజ్‌చేసిన వాహనాలకు బుధవారం బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు పట్టణ సీఐ వాసునాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. ఒక ద్విచక్ర వాహనం, నాలుగు చక్రాల వాహనాలకు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఔత్సాహికులు ఆధార్ కార్డుతో పాటు వేలంపాటలో పాల్గొనాలని సూచించారు.

వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించండి

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు



పట్టణంలోని 21వ వార్డులో ఇంటింటి ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురం టౌన్: ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ఇంటింటికీ మేలు చేస్తున్న ప్రజా ప్రభుత్వాన్ని ప్రజలు మళ్లీ ఆశీర్వదించాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు కోరారు. ఈ మేరకు పట్టణంలోని 21, 22 వార్డుల్లో ఎమ్మెల్యే జోగారావు ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టణంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యేకు మహిళలు హారతులు పట్టి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరికీ అందుబాటులో ఉండేలా సీఎం జగన్ ప్రతి గ్రామంలో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్ ఏర్పాటు చేశారన్నారు. వాటికి అనుగుణంగా సిబ్బందిని ఏర్పాటుచేసి గ్రామంలోనే అన్ని సేవలను అందిస్తున్నారన్నారు. దేశంలోనే ఏ రాష్ట్రం చేయని విధంగా వలంటీర్లను నియమించి ఇంటి ముంగిటకే ప్రభుత్వ పథకాలను చేరవేస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అన్ని ప్రాంతాలు, అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి చెందాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పమని చెప్పారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు.

సంక్షేమం మళ్లీ అందాలంటే ఫ్యాన్ గుర్తుపై ఓటేయాలి

సంక్షేమ పథకాలు మళ్లీ అందాలంటే ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని ఎమ్మెల్యే జోగారావు పిలుపునిచ్చారు. ఈ మేరకు మండలంలోని ఆర్కే బట్టివలస, జమదాల గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేపట్టారు. మే నెల 13న జరగనున్న ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. మీ అందరి చల్లని ఆశీస్సులతో ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా డాక్టర్ తనూజారాణిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. చంద్రబాబు మాయమాటలు నమ్మవద్దని, గత టీడీపీ పాలనలో జరిగిన అరాచకాలను గుర్తుకు తెచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, పార్టీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ మంత్రి రవికుమార్, జేసీఎస్ కన్వీనర్ గొర్లి మాధవరావు, 30 వార్డుల కౌన్సిలర్‌లు, పార్టీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, ఎంపీపీ మజ్జి శోభారాణి వైస్ ఎంపీపీ సిద్దా జగన్నాథ రావు, బంకురు రవికుమార్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, గృహసారథులు, స్థానిక ప్రజలు తదితరులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.



ఆర్కే బట్టివలసలో ఇంటింటి ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

ఎన్నికల అధికారులు నిబద్ధతతో పనిచేయాలి

- ఈఆర్‌ఓ, ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్



మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ, సాలూరు నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి విష్ణుచరణ్

సాలూరు: పోలింగ్ పటిష్టంగా నిర్వహించేందుకు ఎన్నికల అధికారులు నిబద్ధతతో పనిచేయాలని పార్వతీపురం ఐటీడీఏ పీఓ, సాలూరు నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి విష్ణుచరణ్ అన్నారు. ఈ మేరకు సాలూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నియోజకవర్గం ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు తొలివిడతగా జరుగుతున్న మూడు రోజుల శిక్షణ సమావేశంలో ఆఖరి రోజైన సోమవారం ఆయన పరిశీలించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విధుల నిర్వహణ తదితర అంశాలపై అందిస్తున్న ఈ శిక్షణ తీరును సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికలు పారదర్శకంగా స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేలా విధులు నిర్వర్తించాలని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియలో పీఓలు, ఏపీఓల పాత్ర చాలా కీలకమన్నారు. ఎక్కడా ఎటువంటి లోపాలు తలెత్తకుండా చూసుకోవాలని, ఏమైనా సందేహాలు ఉంటే ఈ శిక్షణలో నివృత్తి చేసుకోవాలని సూచించారు. మాక్ పోలింగ్ మొదలుకుని స్ట్రాంగ్ రూమ్‌లలో ఈవీఎంలను భద్రపరిచే వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యల గురించి వివరించారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించరాదని పునరుద్ఘాటించారు. కోడ్ ఉల్లంఘిస్తూ, విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలింగ్ పూర్తయిన తరువాత ప్రిసైడింగ్ అధికారి డైరీ రాయడం, ఫారం 17సి నింపడం వంటి చర్యలపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీప్యాట్‌లను కలిపే కేబుల్స్ ఉపయోగించడంలో తగు జాగ్రత్తలు పాటించడం ద్వారా ఈవీఎంల మొరాయింపు వంటి అంశాలు ఉత్పన్నం కావని స్పష్టం చేశారు. సెక్టార్ అధికారులు వీటిపై ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని సూచించారు. సెక్టార్ అధికారులు ఎన్నికల కమిషన్‌కు ఫస్ట్ రెస్పాండర్‌గా ఉంటారని చెబుతూ, సదరు అధికారులు వారి విధుల పట్ల అవగాహన, తగు సమాచారం కలిగి ఉండాలని ఆదేశించారు. అనంతరం మాక్‌పోలింగ్‌ను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

పీహెచ్‌సీల్లో రోగులకు మెరుగైన వైద్యసేవలు



పీహెచ్‌సీలో మాట్లాడుతున్న డీఎంఓ డాక్టర్ టి. జగన్మోహనరావు

సీతానగరం: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రజలకు ఆరోగ్యభద్రత కల్పిస్తూ మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా మలేరియా నివారణ అధికారి (డీఎంఓ) డాక్టర్ టి.జగన్మోహనరావు అన్నారు. ఈ మేరకు సీతానగరం పీహెచ్‌సీలో వైద్యాధికారులు రోగులకు అందిస్తున్న సేవలపై వివిధ గ్రామాలనుంచి వచ్చిన రోగులతో ఆయన మాట్లాడి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వివిధ రకాల వ్యాధులతో పీహెచ్‌సీకి వచ్చిన రోగులకు ఎండఒత్తిడి కారణంగా సేదతీరే విధంగా చూడాలని, అనంతరం రోగనిర్ధారణకు అవసరమైన వైద్యపరీక్షలు నిర్వహించి వైద్యాధికారి సిఫారసు మేరకు మందులు ఇవ్వాలని సూచించారు. పీహెచ్‌సీ మందులతో వైద్యసేవలు పొందుతున్న వారి ఆరోగ్యభద్రతపై సిబ్బంది దృష్టిసారించి, సిబ్బంది పర్యవేక్షణలో మందులు తగు మోతాదులో వేసుకునే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ప్రత్యేకించి జ్వరంతో ఇబ్బందులు పడుతున్న వారినుంచి జ్వరలక్షణాలు తెలుసుకుని తప్పనిసరిగా రక్తపు పూతలు తీయాలని సూచించారు. అలాగే ల్యాబ్‌టెక్నీషియన్‌లు, ఫార్మసిస్టులు పీహెచ్‌సీల్లో ఉన్న మందుల వాడకం, వాటికి గడువు ఉందో? లేదో? సరి చూసుకోవాలని, ఎక్స్‌పైర్ అయిన మందుల వల్ల వచ్చే అనర్థాలను ఎదుర్కొనే కన్నా ముందుగా మందుల వివరాలు, వ్యాక్సిన్ వివరాలను పరిశీలించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ బి.పావని, సూపర్‌వైజర్లు సత్యవతి, భవాని, శర్మ, వైద్యసిబ్బంది మురళి, నిర్మల, వెంకటలక్ష్మి, శ్రీదేవి పాల్గొన్నారు.

శ్రీరాముడు ఆదర్శప్రాయుడు

సాలూరు: శ్రీరాముడు ఆదర్శప్రాయుడని శ్రీనివాసానంద సరస్వతి అన్నారు. ఈ మేరకు పట్టణంలోని మెంటాడ వీధి కోదండ రామాలయం లో జరుగుతున్న శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం ఆయన ప్రత్యేక అతిథిగా హాజరై ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు.

మేలుచేసే సీఎంకు మద్దతు ఇవ్వండి

- తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ శ్రీకాంత్



పణుకువలసలో ఇంటింటి ప్రచారం చేస్తున్న శ్రీకాంత్, నాయకులు

బలిజిపేట: నిరుపేదలకు అండగా ఉండి, పార్టీలకు అతీతంగా, ప్రతి కుటుంబానికి సంక్షేమాన్ని అందించిన సీఎం జగన్‌మోహన్ రెడ్డికి మద్దతుగా నిలిచి రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్ కోరారు. ఈ మేరకు బలిజిపేట మండలంలోని పణుకువలసలో సోమవారం ఆయన ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటిగడపలో సంక్షేమం అందిందా లేదా అని అడిగి తెలుసుకుని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మీకు మేలు జరిగిందా? లేదా? అన్నది గుర్తించి, ప్రతి కుటుంబానికి మేలు చేసే సీఎం జగన్మోహన్ రెడ్డికి మద్దతు పలకాలని కోరారు. నేరుగా వలంటీర్ల ద్వారా అన్ని పథకాలను లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసిన ఏకైక సీఎం జగన్మోహన్ రెడ్డి అని స్పష్టం చేశారు. అటువంటి నాయకుడిని తిరిగి గెలిపించుకోవాల్సిన అవసరం మనకు ఉందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ విజయ, ఎంపీటీసీ పి.లత, జెడ్పీటీసీ ఎ.రవికుమార్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, మండల వ్యవసాయసలహా సంఘం అధ్యక్షుడు గంగయ్య, పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు దుర్గేశ్వరి, ఆర్.కైలాస్, కె.జగదీష్, సింహాచలం, జె.రామినాయుడు, బి.శ్రీరామ్, పి.పకీరు, పి.తిరుపతినాయుడు, సర్పంచ్ ఆర్.శ్రీనివాసరావు, పి.నారాయణరావు, కె.కృష్ణమూర్తినాయుడు తదితరులు పాల్గొన్నారు.

45 మంది వలంటీర్ల రాజీనామా



పార్వతీపురం టౌన్: ఎంపీడీఓ అకీబ్ జావేద్‌కు రాజీనామా పత్రాలు అందజేస్తున్న వలంటీర్లు



సాలూరు రూరల్: ఎంపీడీఓకు రాజీనామా పత్రాలను అందజేస్తున్న వలంటీర్లు



పాచిపెంట: రాజీనామా పత్రాలను చూపిస్తున్న వలంటీర్లు

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మున్సిపాలిటీకి చెందిన 20 మంది వలంటీర్లు, మండలంలోని నర్సిపురం గ్రామానికి చెందిన 25 మంది వలంటీర్లు సోమవారం స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. ఈ మేరకు మున్సిపల్ సిబ్బందికి, ఎంపీడీఓ అకీబ్ జావేద్‌కు వారి రాజీనామా పత్రాలను అందజేశారు. నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న సంక్షేమాన్ని ప్రజలకు తెలియజేసే క్రమంలో ప్రతిపక్షాలు అడ్డుకోవడంతో వలంటీర్లు వారి ఉద్యోగానికి రాజీనామా చేసినట్లు తెలిపారు. ప్రతిగడపకు వెళ్లి ప్రభుత్వం చేస్తున్న మంచి పనుల గురించి తెలియజేసి మళ్లీ రాష్ట్రంలో ప్రజలకు మంచి జరగాలంటే అది జగనన్నతోనే సాధ్యమని తెలుసుకుని, జగన్ అన్నని, ఎమ్మెల్యేగా అలజంగి జోగారావును గెలిపించాలన్న ఉద్దేశంతో వలంటీర్లు అందరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రాజీనామా పత్రాలను అందజేశారు.

సీతానగరంలో..

సీతానగరం: మండలంలోని పెదంకలాం సచివాలయం పరిధిలో ఉన్న సుమిత్రాపురం గ్రామానికి చెందిన గ్రామవంలంటీర్లు సోమ వారం స్వచ్ఛందంగా వారి రాజీనామా పత్రాలను సచివాలయ కార్యదర్శులు గౌరీశ్వరి, సోమేశ్వరరావులకు అందజేశారు. ఈ మేరకు రాజీనామాలు చేసిన వలంటీర్లు మాట్లాడుతూ ఉన్నత చదువులు అభ్యసించి ఉద్యోగావకాశాల కోసం నిరీక్షిస్తున్న సమయంలో స్వగ్రామంలో విధులు నిర్వహించడానికి ఉపాధి అవకాశం కల్పిస్తూ 50 నుంచి 60 కుటుంబాలకు సేవలందించాలని ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేయడంతో ఆ కుటుంబాలకు సేవలు అందించామన్నారు. నిరంతరం సేవలందించే వలంటీర్ వ్యవస్థపై ప్రతిపక్ష పార్టీల నేతలు అనుచిత వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరం. గ్రామ వలంటీర్ సేవలందిస్తున్నందున వచ్చిన సంతృప్తి మరెక్కడా ఇవ్వదని భావించి విధుల్లో చేరాం. వలంటీర్ వ్యవస్థను తెచ్చిన జగనన్నను మరోపర్యాయం ముఖ్యమంత్రిని చేయడానికి రాజీనామా చేసి ప్రచారం చేయడానికి తమవంతు కృషి చేస్తామని వలంటీర్లు చెప్పారు. లంటీర్ వ్యవస్థను తెచ్చిన జగనన్నను ముఖ్యమంత్రిని చేయడానికి, పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు విజయానికి తమవంతు సహకారాన్ని అందించడానికి గ్రామాల్లో స్వచ్ఛందంగా ప్రచారం చేస్తామని వలంటీర్లు స్పష్టం చేశారు. రాజీనామా చేసిన వారిలో చిటికల ఉషారాణి, బెవర రాంబాబు, మండంగి ప్రసాద్‌లున్నారు.

సాలూరులో..

సాలూరు రూరల్: సాలూరు మండలంలోని 5 పంచాయతీలకు సంబంధించి 68 మంది వలంటీర్లు సోమవారం వారి రాజీనామా పత్రాలను ఎంపీడీఓ ఫణీంద్ర కుమార్‌కు అందజేశారు. రాజీనామా చేసిన వారిలో జీగిరాం గ్రామానికి చెందిన 19 మంది, కూర్మరాజుపేట 13, కరాసవలస 7, కొత్తవలస 11, పెదపదం 18,మంది వలంటీర్లు ఉన్నారు. వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్‌తో పాటు ఆయా పంచాయతీలైన జీగిరాం, నెలిపర్తి, కూర్మరాజుపేట, కరాసవలస, కొత్తవలస, పెదపదం, పారన్నవలస, నార్లవలస సర్పంచ్‌ల సమక్షంలో ఎంపీడీఓకు రాజీనామా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వలంటీర్లు వారి అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేద ప్రజలకు సంక్షేమ పథకాలు నేరుగా ఇంటికే అందించాలన్న సంకల్పంతో వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేశారన్నారు. ఒక మంచి పని చేయడంలో ఉన్న తృప్తిని ఇంతకాలం చవిచూశామని సంతోషం వెలిబుచ్చారు. మేమంతా జగన్‌మోహన్ రెడ్డి గెలుపుకోసం పనిచేయాలని ఉన్నా ఎన్నికల నిబంధనల ప్రకారం తమకు ఈ ఉద్యోగం అడ్డంకిగా ఉందన్నారు. ఆయన మళ్లీ ముఖ్యమంత్రి అవడానికి తమ ఉద్యోగాలకు రాజీనామ చేయడానికి వెనుకాడదలుచుకోలేని, అందుకే ఈ రోజు రాజీనామాలు చేశామని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయాలని, అందుకోసం తామంతా కలిసికట్టుగా జగన్‌మోహన్ రెడ్డి పేదప్రజలకు చేసిన మంచిని గడపగడపకు వివరిస్తామని స్పష్టం చేశారు.

జగన్‌మోహన్ రెడ్డిపై అభిమానంతో రాజీనామాలు

ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పరిపాలనా విధానంపై అభిమానంతో వలంటీర్లు రాజీనామా చేశారని, వారి సేవలు ఇంతవరకు అందుకున్న ప్రజలు సంతోషంగా ఉన్నారని వైఎస్ ఎంపీపీ రెడ్డి సురేష్ న్నారు. మళ్లీ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వస్తారని మళ్లీ వారి సేవలు వినియోగించుకోడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రతి వలంటీర్ జగన్‌మోహన్ రెడ్డి సైనికుడేనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జీగిరాం వైఎస్సార్‌సీపీ నాయకులు అల్లు సూరప్పలనాయుడు, వై.వేణు, కూర్మరాజుపేట మాజీ సర్పంచ్ మన్మథ, కొత్తవలస మాజీ సర్పంచ్ సీతారాం తదితరులు పాల్గొన్నారు.

పాచిపెంటలో 24 మంది వలంటీర్లు

పాచిపెంట: జగనన్నకు అండగా నిలుస్తామంటూ వలంటీర్లు స్పష్టం చేస్తున్నారు. ఈ మేరకు పాచిపెంట మండలంలోని పాచిపెంట, మూటకూడు సచివాలయాల పరిధిలో 24 మంది వలంటీర్లు సోమవారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను మండలపరిషత్ కార్యాలయంలో అధికారులకు అందించగా ఎంపీడీఓ ఆమోదించారు. కాగా ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డి తరపున నిలబడేందుకే, ఉపముఖ్యమంత్రి రాజన్నదొర వెంట పనిచేసేందుకు తాము రాజీనామాలు చేశామని, వైఎస్సార్‌సీపీ తరపున ప్రచారం ముమ్మరం చేస్తామని వలంటీర్లు ఈ సందర్భంగా తెలిపారు.

సీఎంపై దాడిలో కుట్రదారులను శిక్షించాలి



విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సాలూరు రూరల్: విజయవాడలో సీఎం జగన్‌మోహన్ రెడ్డిపై రాళ్లతో దాడిచేసిన వారిని, చేయించిన వారిని వెంటనే పట్టుకుని శిక్షించాలని వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్, ఎంపీటీసీ సూరప్పలనాయుడు, మాజీ సర్పంచ్‌లు మన్మథ, బొన్నాడ సీతారాం డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్ రెడ్డి గెలుపు ఖాయంగా కనిపించడంతో జగన్‌మోహన్ రెడ్డిని అంతమొందించడానికి చంద్రబాబునాయుడు కుట్రలు పన్నుతున్నారన్నారు. తలకు తగిలిన రాయి ఏమాత్రం శిరంపై తగిలి ఉంటే ఆయన ప్రాణాలకే ప్రమాదం వాటిల్లేదని ఆందోళన వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాలు అమలు చేస్తూ దూసుకుపోతున్న జగన్ చరిష్మాకు టీడీపీ కూటమి వణికిపోతోందన్నారు. మానాయకుడు జగన్ మోహన్ రెడ్డి ప్రజల మనిషని, ఆయనకు ఏదైనా ప్రమాదం తలపెట్టాలని చూసిన వారు భూస్థాపితం కాక తప్పదని స్పష్టం చేశారు.

రోడ్డుపై వాహనాల తనిఖీ



కార్లను తనిఖీ చేస్తున్న ఎస్సై రాజేష్

సీతానగరం: సాధారణ ఎన్నికలను పురస్కరించుకుని రాష్ట్రరహదారిపై తిరుగాడుతున్న వాహనాలను ఎక్కడైనా తనిఖీ చేసే అధికారం సంబంధిత అధికారులకు ఉందని ఎస్సై ఎం.రాజేష్ అన్నారు. రాష్ట్ర రహదారిలో చినభోగిలి, సీతానగరం జంక్షన్‌లలో తిరుగాడుతున్న వాహనాలను సోమవారం ఉదయం 4 గంటల సమయంలో సిబ్బంది సహకారంతో ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఓటర్లను ప్రలోభ పెట్టడానికి వాహనాల్లో నగదు, నిత్యావసర సరుకులు, ఆభరణాలు వాహనాల్లో వెళ్తున్నట్లు గమనిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు. ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులకు వాహనాలు తనిఖీ చేసే అధికారాన్ని పార్వతీపురం ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.హేమలత కల్పించారన్నారు. వాహనాల్లో నగదు, చిల్లరవస్తువులు, ఆభరణాలకు సంబంధించి ఎటువంటి ఆధారాలు లేకుండా కనిపిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్క్వాడ్ అధికారులకు వాహనడ్రైవర్లు సహకరించాలని, ఎన్నికలు సమీపిస్తున్న వేళ రాష్ట్ర రహదారిలో నిరంతరం వాహన తనిఖీలు అనివార్యమని ఎస్సై ఎం.రాజేష్ స్పష్టం చేశారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన



ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద అవగాహన కల్పిస్తున్న అగ్నిమాప సిబ్బంది

పార్వతీపురం టౌన్: అగ్నిమాపక వారోత్సవాల నేపథ్యంలో పార్వతీపురం ఫైర్ స్టేషన్ ఆధ్వర్యంలో విస్తృతంగా అగ్ని ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాలు సోమవారం నిర్వహించారు. పార్వతీపురం పరిసర ప్రాంతాలలో విస్తరించి ఉన్న పలు ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలతో పాటు, పరిశ్రమలు, ఆస్పత్రుల్లో ప్రయోగాత్మకంగా అగ్ని ప్రమాద సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలను వివరిస్తున్నారు. ఈ మేరకు స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో అగ్నిప్రమాదం సంభవిస్తే తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన చేపట్టారు. ప్రతి వారంలో ఒక రోజు అగ్ని ప్రమాదాల అంశంపై మాక్ డ్రిల్ చేపడతామని, అగ్నిమాపక వారోత్సవాల నేపథ్యంలో ఈ నెల 20వ తేదీ వరకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పార్వతీపురం ఫైర్‌స్టేషన్ హౌస్ ఆఫీసర్ సుధాకర్ పేర్కొన్నారు.

సీఎం జగన్‌పై దాడి పిరికిపంద చర్య



విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు రంగునాయుడు

మక్కువ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేమంతా సిద్ధం బస్సుయాత్ర చేస్తున్న సమయంలో ఆయనపై రాయి విసిరి, నుదుటిపై గాయం చేయడం పిరికిపంద చర్య అని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మావుడి రంగునాయుడు అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన మండలకేంద్రం మక్కువలో విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న మేమంతా సిద్ధం బస్సుయాత్రకు వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక ఇటువంటి కుట్రలకు పాల్పడుతున్నారన్నారు. ప్రజల్లోకి జగన్‌మోహన్‌రెడ్డిని రానివ్వకుండా, నివారించేందుకు కుట్రలు పన్నుతున్నారని, రాజకీయాల్లో సీఎం జగన్‌ను ఎదుర్కోలేక ఇటువంటి భౌతికదాడులకు దిగుతున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభంజనాన్ని ఎవరూ ఆపలేరన్నారు. ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా వచ్చే ఎన్నికల్లో జగన్‌మోహన్ రెడ్డి మరోసారి సీఎంగా తప్పక ప్రమాణస్వీకారం చేస్తారని స్పష్టం చేశారు. సీఎం జగన్‌పై దాడికి పాల్పడినవారిని గుర్తించి, శిక్షపడేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బెల్లాన కృష్ణమూర్తి, బురిడి చిన్నారావు, కొత్తూరు శంకర్రావు, పొన్నాడ కృష్ణ, సుబ్బరాజు, కొల్లి సత్యనారాయణ, పూడి తిరుపతి, ఆలవట్టం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ ప్రిన్సిపాల్‌కు సన్మానం

సాలూరు రూరల్: ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించిన కేజీబీవీ ప్రిన్సిపాల్ గాదిపల్లి ప్రశాంతిని పార్వతీపురం మన్యం జిల్లా ఎస్ఎస్ఏ అధికారులు సోమవారం సత్కరించారు. మండలంలోని కరాసువలసలో గల పాఠశాలలో ఒకేషనల్ మొదటి సంవత్సరం ఫలితాల్లో 27 మంది విద్యార్థులకు గాను 27మంది, ద్వితీయ సంవత్సరం ఇంటర్మీడియట్‌లో 34 మందికి 30 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ చేసిన కృషిని వారు అభినందించారు.

ఓటమి భయంతోనే జగన్‌పై దాడి



మాట్లాడుతున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

పాచిపెంట: పొత్తులతో వస్తున్న టీడీపీ కూటమి జరగబోయే ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడిపోతుందని ముందుగానే గ్రహించి, ప్రజానాయకుడైన జగన్‌మోహన్‌రెడ్డిని అంతమొందించేందుకు హత్యాయత్నానికి పాల్పడ్డారని ఎంపీపీ బడ్నాన ప్రమీల, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గొట్టాపు ముత్యాలునాయుడు, పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి డోల బాబ్జీలు మండిపడ్డారు. ఈ మేరకు సోమవారం వారు పాచిపెంట మండల కేంద్రంలో విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి మాట్లాడుతూ, ప్రజాభిమానం నిండుగా ఉన్న జగన్‌మోహన్‌రెడ్డి రానున్న ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని అన్ని సర్వేలు వెల్లడిస్తున్న నేపథ్యంలో ఆ ఉక్రోశం, కోపంతో జగన్‌మోహన్‌రెడ్డిపై టీడీపీ, జనసేన కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు. సమావేశంలో వైస్‌ఎంపీపీ కొరిపల్లి రవీంద్ర, జేసీఎస్ కన్వీనర్ టి.గౌరీశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు మీసాల ఆదినారాయణ, నడిపల్లి కామేశ్వరారావు, బోను మురళి, మజ్జి వెంకటరావు తదితరులు ఉన్నారు.